క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఇన్విటేషన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బొమ్మూరుకు చెందిన మారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాయింట్ ఫైట్ విభాగానికి సంబంధించి 23 కేజీలలో ఎ.రవితేజ, 35 కేజీలలో టి.ధరణి ప్రియత్, 113 కేజీలలో కె.శశాంక్ స్వర్ణ పతకాలు సాధించారు. 22 కేజీలలో జె.రేవన్ వర్మ, 68 కేజీలలో ఎం.శ్రీకర్, 75 కేజీలలో ఎస్.రుత్విక్ వీర సాగర్, 25 కేజీలలో వి.అశ్వథ్ వర్మ రజిత పతకాలను, బాలికల విభాగంలో 26 కేజీలలో ఎం.సుహానా రజత పతకం సాధించారు. కాగా.. విజేతలతో పాటు కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు ఎం.గణేష్, సెక్రటరీ ఎన్.గిరి వెంకట రమణ, కోశాధికారి ఎం.భవానీ శంకర్‌లను ప్రముఖ న్యాయవాది, కిక్ బాక్సింగ్ చైర్మన్ గొందేశి శ్రీనివాసులురెడ్డి అభినందించారు.

విక్రమ్ సారాభాయ్‌కి నివాళి

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కోమల లక్ష్మి అధ్యక్షతన మంగళవారం విక్రమ్ సారాభాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోమల లక్ష్మి మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో సారాభాయ్ చేసిన పరిశోధనలు, తద్వారా జరిగిన దేశ ప్రగతి గురించి విద్యార్థులకు వివరించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో మరికొందరికి జీవితం


ఫ్లాష్‌మాబ్ చేస్తున్న వైద్య విద్యార్థులు

కంబాలచెరువు: అవయవదానంతో మరింత మందికి జీవితాన్ని ప్రసాదించవచ్చని జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. అవయవదానం దినోత్సవం సందర్భంగా జీవన్ దాన్ ఏపీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి, కిమ్స్, జీఎస్ఎల్ మెడికల్, డెంటల్, ఫిజియోథెరపీ, నర్సింగ్, పారా మెడికల్ కాలేజ్, డెల్టా హాస్పిటల్ వైద్యులు, వైద్య విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని వాక్‌థాన్‌తో ఊరేగింపు నిర్వహించారు. కంబాలపార్క్ వద్ద ఫ్లాష్ మాబ్ డ్యాన్స్ చేశారు. అవయవదానం అవసరాన్ని కిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామరాజు, డాక్టర్ గన్ని భాస్కరరావు, డెల్టా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, సాయి హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మంజూష, రొటేరియన్ తీగల రాజా, జీవన్‌దాన్ ఏపీ అధికారి డాక్టర్ కె.రాంబాబు వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కంబాలచెరువు: జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో జరిగిందని జిల్లా అధ్యక్షుడు నాగరాజు మంగళవారం తెలిపారు. జిల్లాలోని 19 మండలాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయన్నారు. ప్రధాన కార్యదర్శిగా వీరబాబు, కోశాధికారిగా జైకుమార్ ఎన్నికయ్యారన్నారు.

సాగుకు కసాయం

- పెరిగిన కషాయాల వినియోగం
- ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి
- రసాయనాలతో పోల్చితే ఖర్చు బాగా తక్కువ
- డ్రోన్లతో పిచికారీ


వరి పంటపై కషాయాన్ని పిచికారీ చేస్తున్న డ్రోన్

కడియం: రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో దీర్ఘకాలంలో నేల స్వాభావిక స్వభావం కోల్పోవడంతో పాటు పెట్టుబడులు కూడా విపరీతంగా పెరిగిపోవడాన్ని సాగుదారులు స్వానుభవంలో తెలుసుకుంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడి లేని వ్యవసాయం లేదా ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రతి ఏటా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. మొదట్లో రైతులు మొగ్గు చూపకపోయినప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాగు విధానం ద్వారా పంట దిగుబడి పెరగడం, నేల స్వభావం మారడం, పెట్టుబడి ఖర్చుల తగ్గడాన్ని స్వీయ అనుభవం ద్వారా గుర్తిస్తున్న రైతులు సాగులో ప్రకృతి విధానాలను అనుసరించేందుకు ముందుకు వస్తున్నారు.

భూసారం పరిరక్షణ

ప్రకృతి సాగు విధానంలో నేల స్వాభావికతను కాపాడడంతో పాటు, భూసారం కోల్పోకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. పంటకు ముందు నవధాన్యాలను చల్లి భూసారాన్ని పెంచడం మొదలుకుని దిగుబడిని పెంచేందుకు, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను అధికంగా చేసేందుకు ప్రస్తుతం అనేక కషాయాలను ఈ విధానంలో వినియోగిస్తున్నారు. ఇందులో పలు కషాయాలు అత్యంత ఘాటుగా ఉండి వినియోగించేటప్పుడు రైతులు ఇబ్బంది పడేవారు. అయితే అందుకు కూడా ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. డ్రోన్ సాయంతో కషాయాలను పంటలపై స్ప్రే చేస్తున్నారు. రైతుకు కష్టం తప్పడంతో పాటు ప్రకృతి ప్రసాదించిన వస్తువులనే సాగులో వినియోగిస్తుండడం ప్రస్తుతం బాగా పెరిగింది.

పంటలపై పిచికారీ

తూటికాడ కషాయం, చేప వ్యర్థాల నుంచి తయారు చేసిన కషాయం, ఇంగువ కషాయం వంటి వాటిని పంటలపై వినియోగిస్తున్నారు. ముఖ్యంగా వరి పంటపై ఈ కషాయాల వినియోగం ద్వారా స్పష్ట మైన మార్పును గుర్తిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించినప్పటికీ పంట ఆరోగ్యంపై రైతులకు ఎప్పుడూ ఆందోళగానే ఉండేది. అయితే ప్రకృతి సాగు విధానంలో వినియోగిస్తున్న కషాయాలు చల్లిన తర్వాత పంట ఆరోగ్యంలో స్పష్టంగా మార్పు కన్పించడాన్ని రైతులు గుర్తిస్తున్నారు. దీంతో తోటి రైతులు కూడా వీటి వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నారు.

తక్కువ ఖర్చు

వరి పంటను ఏవైనా తెగుళ్లు ఆశిస్తే, వాటిని నివారించేందుకు వాడే రసాయన పురుగు మందుల కొనుగోలుకు రైతులకు వేల రూపాయలు ఖర్చయ్యేవి. అయితే అవే తెగుళ్లను అడ్డుకునేందుకు ప్రకృతి సాగు విధానంలో డ్రోన్ ద్వారా కషాయాలను పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల వందల రూపాయల ఖర్చుతోనే స్పష్టమైన మార్పు కన్పిస్తోందని రైతులు చెబుతున్నారు. కడియం, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల తదితర ఆరు గ్రామాల్లోని దాదాపు 1500 ఎకరాల్లో ఈ ప్రకృతి సాగు విధానాన్ని రైతులు అనుసరిస్తున్నారని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.

కషాయాలు ఇవే

= ఆకులపై కాండం తొలిచే పురుగు గుడ్లను పొదగనీయకుండా వేపగింజల కషాయాన్ని పిచికారీ చేస్తున్నారు. దీనిలో పాల ఇంగువను జోడించడం ద్వారా సిలీంద్ర నాశినిగా, చేప, బెల్లం ద్రావణం కలపడం ద్వారా పైరుకు పోషకాలు అందించడానికి తోడ్పడుతుంది. వరిపైరు నాటిన 20–45 రోజుల్లో రెండు సార్లు దీన్ని పిచికారీ చేయాలి.

» చిన్న పురుగు నుంచి పెద్ద పురుగు వరకు అన్నింటినీ నాశనం చేసేందుకు అగ్ని అస్త్రం వినియోగిస్తారు. కాండం తొలిచే పురుగును నశింప చేస్తుంది. 3 గ్రోత్ ప్రమోటర్స్‌గా చేప బెల్లం, కోడిగుడ్డు నిమ్మరసం, పంచగవ్య ఈ మూడింటిలో ఏదో ఒకటి స్ప్రే చేయాల్సి ఉంటుంది. పొట్ట దశలో ఒకసారి, ఈనిక తరువాత చల్లాలి. వీటి ద్వారా దిగుబడితోపాటు, గింజల నాణ్యత కూడా పెరుగుతుంది.

కషాయాలతో మంచి మార్పు

"ప్రకృతి సాగు విధానాన్ని మూడు పంటలుగా అనుసరిస్తున్నాను. రసాయనిక ఎరువులు, పురుగు మందులతో పోలిస్తే కషాయాలతోనే ఎక్కువ మార్పు కనిపిస్తోంది. పంట ఆరోగ్యంగా ఉండడంతో పాటు దిగుబడి కూడా బాగుంటుంది. ఖర్చు కూడా తక్కువగా అవుతోంది.

– జె.గయుడు, రైతు, దుళ్ల

పంట ఆరోగ్యం

ఇంగువ వేప గింజల కషాయం, అగ్ని అస్త్రం, చేప బెల్లం కషాయాలను పంటపై వివిధ దశల్లో పిచికారీ చేయడం వల్ల పంట ఆరోగ్యం మెరుగుపడుతోంది. రసాయన పురుగు మందులతో పోలిస్తే ఖర్చు భారీగా తగ్గుతోంది. వీటితో వివిధ దశల్లో వచ్చే పురుగులు, దోమను సమర్థవంతంగా నివారించవచ్చు."

– సీహెచ్ కుమార్, రైతు, దుళ్ల

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి


రాజమహేంద్రవరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో చేపట్టిన వివిధ ఇంజినీరింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. శ్రామిక భవన్, ఆర్డీవో ఆఫీస్ వద్ద సీసీ డ్రెయిన్, కంటిపూడి రామారావు స్కూల్ సీసీ రోడ్డు, ఎన్ఆర్‌సీపీ రోడ్డు జంక్షన్ వద్ద సీసీ డ్రెయిన్, పూలే భవన్, ఐఎంఏ హాల్‌తో పాటు ఎల్వీ శాస్త్రి రోడ్డులో బీటీ రోడ్డు పనులను పర్యవేక్షించి, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్ఈ(ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదర్సా అలీ, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా హజ్ కమిటీ నియామకం


మాజీ మంత్రి వేణుతో మాట్లాడుతున్న నిజాముద్దీన్

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం 2025 హజ్ కమిటీని కేంద్ర ప్రభుత్వ చట్టం నిబంధనలకు విరుద్ధంగా నియమించిందని, దీనిపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినట్లు జిల్లా జమియాత్ ఉలేమా జనరల్ సెక్రటరీ షేక్ నిజాముద్దీన్ అన్నారు. ఆయన మంగళవారం బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను కలిశారు. ఈ సందర్భంగా హజ్ కమిటీ నియామకంలో జరిగిన అవకతవకలను వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 16న కమిటీని ఏర్పాటు చేశారన్నారు. నిబంధనల ప్రకారం దీనిలో ముగ్గురు ఇస్లామిక్ ధార్మిక పండితులను నియమించాలన్నారు. కానీ కూటమి ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ కార్యకర్తలైన పఠాన్ ఖాదర్ ఖాన్, షేక్ హాసన్ బాషాలను నియమించిందన్నారు. నిజానికి వీరిద్దరూ ఇస్లామిక్ ధర్మ శాస్త్రాన్ని అధ్యయనం చేయలేదని తాను చాలెంజ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. పిటిషనర్ తరఫున అడ్వకేట్ కనకల దేవీ ప్రసన్న కుమార్ సింగల్ బెంచ్ జడ్జి కె.శ్రీనివాసులురెడ్డి ముందు మంగళవారం తమ వాదనలు వినిపించారన్నారు. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి దీనిపై రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారన్నారు.

ఎమ్మెల్యే మెప్పు కోసమే భరత్ రామ్‌పై విమర్శలు

- రాజకీయాల్లో గెలుపు, ఓటమి సహజం
- వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు అప్పారావు


విలేకరులతో మాట్లాడుతున్న మజ్జి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దగ్గర మెప్పు కోసమే టీడీపీ నాయకులు అనవసరంగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఎవ్వరూ శాశ్వతంగా అధికారంలో ఉండరన్న విషయం గ్రహిస్తే మంచిదన్నారు. ఏడు నియోజక వర్గాల పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భరత్ రామ్ గెలిస్తే, వాటిలో ఒక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వాసు నెగ్గారన్నారు. రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యేగా ఉండగా విజిటబుల్ మార్కెట్ తరలించాలని చూస్తే అప్పుడు అడ్డుకున్నది తెలుగుదేశం నాయకులేనన్నారు. భరత్ రామ్ ఎంపీ అయ్యాక మార్కెట్ తరలించాలని రౌతు ప్రయత్నిస్తే, అంతదూరం వెళ్లలేమని మజ్జి రాంబాబు తదితరులు వచ్చి మొరపెట్టుకుంటే యథాతథంగా ఉంచారన్నారు. ఇప్పుడు బొమ్మూరు అవతలకు మార్కెట్ తరలిస్తే, మజ్జి రాంబాబు లాంటి నలుగురైదుగురికి తప్ప, ఇంక ఎవరికీ ఉపయోగం ఉండదన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని కరోనా సమయం నుంచి ఎంతో అభివృద్ధి చేసిన ఘనత భరత్ రామ్‌కే దక్కుతుందన్నారు. భరత్ రామ్‌ను విమర్శించడం టీడీపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. నగరంలో ఇప్పటివరకు ఎవరు నెగ్గినా సరే, అంతకుముందు వాళ్లు చేసిన అభివృద్ధిని కొనసాగించేవారని, ఇప్పుడు దానికి విరుద్ధంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముప్పన శ్రీను, సెక్రటరీ ధమదాసు శ్యామ్‌సుందర్, సిటీ బూత్ కమిటీ ప్రెసిడెంట్ సీరపు గణేష్ రెడ్డి, సిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ షబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి


ప్రశాంతి, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పబ్లిక్ ప్రదేశాలలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడాన్ని పూర్తిగా నిషేధించినట్టు కలెక్టర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. వీటిపై మార్గదర్శకాలు వెలువడ్డాయని, ప్రజలు, రాజకీయ పార్టీలు, సంస్థలు గమనించాలని కోరారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం..

- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి లిఖిత పూర్వక ముందస్తు అనుమతి పొందకుండా నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదు.
- తాత్కాలిక ఫ్లెక్సీలు, బ్యానర్లకు గరిష్ఠంగా 24 గంటల పాటు మాత్రమే ఉంచడానికి అనుమతి ఉంది.
- ఫ్లెక్సీలు, బ్యానర్ల సైజు, సంఖ్య ఆధారంగా దరఖాస్తు సమయంలోనే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు రుసుము చెల్లించాలి.
- నిర్దిష్ట సమయం పూర్తయిన తర్వాత వాటిని తొలగించకపోతే అదనపు రుసుమును వసూలు చేస్తారు.
- నిబంధనలను ఉల్లంఘించి వదిలేసిన పక్షంలో నగరపాలక సంస్థ వాటిని తొలగించి, అందుకు అయిన ఖర్చును దరఖాస్తుదారుడి నుంచి వసూలు చేస్తారు.
- తాత్కాలిక ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి ఈ కింద ప్రదేశాల్లో నిషేధం ఉంది. నగర పాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, సెంట్రల్ మీడియన్లు, అన్ని ప్రభుత్వ భవనాల పరిసరాలు, కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ గల ప్రదేశాలు, మున్సిపల్ పార్కుల పరిసరాలు, ఆసుపత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదుల పరిసరాలు, వారసత్వ నిర్మాణాలు, రక్షిత స్మారక చిహ్నాలు, జలాశయాలు, ట్యాంక్ బండ్లు, పాదచారుల మార్గాలు, వాకింగ్ ట్రాక్‌లు, విగ్రహాలు, ట్రాఫిక్ సర్కిళ్ల పరిసరాలు, ప్రజామరుగుదొడ్లు, పట్టణ ప్రజా సౌకర్యాల పరిసరాలు, బస్ షెల్టర్లు, ఆటో స్టాండ్లు, సమాధి స్థలాలు, దహన స్థలాల పరిసరాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు, ఫ్లైఓవర్ల వద్ద ఏర్పాటు చేయకూడదు.

హండ్రెట్ ఫీట్ రోడ్డులో విద్యుత్ వెలుగులు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరం నగరంలోకి వచ్చే హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధిలైట్లను ఎట్టకేలకు నగరపాలకసంస్థ అధికారులు వెలిగించారు. గత 40 రోజులుగా ఇక్కడ లైట్లు వెలగక ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సాక్షి పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్ట్రీట్ లైట్లు వెలిగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధి దీపాలు

బీఎస్ఐ కొంతమూరు అధ్యక్షుడిగా విజయసారథి


విజయసారథిని సత్కరిస్తున్న బిషప్ ప్రతాప్ సిన్హా

రాజమహేంద్రవరం రూరల్: బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) కొంతమూరు బ్రాంచ్ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవరెండ్ ఎం.విజయసారథి నియమితులయ్యారు. ఏవీ అప్పారావు రోడ్డులోని సీఎస్ఎన్ చర్చిలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ఆగ్జిలరీ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్‌సిన్హా కొమనాపల్లి ఆధ్వర్యంలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షురాలు లీల బోస్ సమక్షంలో విజయ సారథిని ఎంపిక చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొంతమూరులోని కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, జంగాల కాలనీ, ఉద్యోగుల కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ఏరియా, క్వారీ ప్రాంతం, రాయుడు పాకలు, కొలమూరు, కొంతమూరు గ్రామాల్లోని పరిమినగర్, బొమ్మన కాలనీ, సాయిరామ్ కాలనీ, వెంకటేశ్వర ప్లాస్టిక్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వాటిని తప్పించుకునే మార్గాలపై మంగళవారం బీవీఎం హైస్కూల్లో సెంట్రల్ జోన్ శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఏఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలందరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆపద సమయంలో పోలీసుల సాయం కోరవచ్చన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా నష్టాలు, శక్తి యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, సెంట్రల్ జోన్ శక్తి టీం ఇన్‌చార్జ్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌కేవీటీ'లో వర్క్ షాప్


సమీక్షలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: వికసిత్ భారత్‌కు మానవ మూలధనం ఆవశ్యకతపై మంగళవారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు ప్రారంభించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం సవాళ్లు, సమాజ ప్రమేయం, సాధనాలు, వనరులు తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అధికారి సుభాషిణి, డీఎల్‌డీవో విద్యావాణి, డీఎస్‌డబ్ల్యూఓ గారజుద్దీన్, డీబీసీడబ్ల్యూఓ శరణ్య, డబ్ల్యూసీడీపీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు

కంబాలచెరువు: పుస్తక పఠనంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అన్నారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా మంగళవారం ఆ కళాశాలలో గ్రంథాలయ అధికారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ గ్రంథాల ఆవశ్యకతను వివరించారు. ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథ పఠనంతో పోటీల్లో పాల్గొనడానికి మేధాశక్తి లభిస్తుందన్నారు.

విప్పర్తి న్యూటన్‌కు పురస్కారం


కేవీ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న న్యూటన్

సీటీఆర్ఐ: ఇన్‌స్పైర్ 2025 అంతర్జాతీయ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండు అన్నారు. స్థానిక జవహర్ లాల్ నెహ్రూ రోడ్డులోని ఇండియా ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ డాక్టర్ కేవీ రెడ్డి కార్యాలయంలో గ్లోబల్ పీస్ – కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా వేత్తగా, సామాజిక వేత్తగా ఆయన సేవలను గుర్తించి, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డు అందజేశారు. ట్రేడ్ కమిషనర్ డాక్టర్ కేవీ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయాలని, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అద్దంకి రాజాయోనా, పిన్నమనేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



జేగురుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడియం: మండలంలోని జేగురుపాడులో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలో ర్యాలీ అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, మాజీ ఎంపీటీసీ మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల నిరసన


నిరసన తెలుపుతున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

కంబాలచెరువు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు తక్షణమే అధ్యాపకుల బదిలీలు జరపాలని ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీసీటీఏ జోనల్ సెక్రటరీ మల్లికార్జున, డిస్టిక్ సెక్రటరీ దుర్గారావు, జీసీజీటీఏ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, పద్మజ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు నెలలుగా అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులందరికీ బదిలీలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు మాత్రం చేయకపోవడం దారుణమన్నారు. దీనిపై అనేక సార్లు ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ భోజన విరామ సమయంలో అధ్యాపకుల వివిధ డిమాండ్లను తెలుపుతూ నల్ల బ్యాడ్జీలను ధరించి కాలేజీ ఆవరణలో నిరసన తెలుపుతున్నామన్నారు. అలాగే ఈ నెల 18వ తేదీన ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

పిల్లల్లో రక్తహీనతను నివారిద్దాం

కంబాలచెరువు: డీ వార్మింగ్ డే సందర్భంగా మంగళవారం జాంపేటలోని నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎ.రామకృష్ణారావు మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనత ఏర్పడడానికి చిన్న పేగుల్లో పరాన్న జీవులుగా పెరిగే బద్దె పురుగులే కారణమన్నారు. వాటి నివారణకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మందులను ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. పాఠశాలలో 140 మంది విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేశారు.

96 శాతం పంపిణీ

కడియం: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని 12,574 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని, మొత్తం చిన్నారుల్లో 96 శాతం మందికి అందజేసినట్టు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌తో కలిసి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కడియం హైస్కూల్లో ప్రారంభించారు.